దూర విద్య ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 11: ఉస్మానియా యూనివర్సిటీ దూర విద్యా కేంద్రమైన ప్రొఫెసర్ జి.రాంరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ (పీజీఆర్ఆర్సీడీఈ)లో వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు పీజీఆర్ఆర్సీడీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ జీబీ రెడ్డి తెలిపారు. యూజీసీ నిబంధనల మేరకు వివిధ కోర్సులకు ప్రతి ఏటా రెండు దఫాలుగా ప్రవేశాలు నిర్వహిస్తున్నామని, అందులో భాగంగా రెండో దఫా మార్చి 31వ తేదీ వరకు ప్రవేశాలు నిర్వహిస్తామని ప్రకటించారు. వివిధ పీజీ, యూజీ, డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సులతో కలిపి మొత్తం 72 ఓపెన్ డిస్టెన్స్ లెర్నింగ్ కోర్సులను అందిస్తున్నట్లు వివరించారు. కోర్సుల వివరాలు, నిబంధనలు, ఫీజు వివరాలు తమ వెబ్ సైట్ www. oucde. netలో అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. అందులో లాగిన్ అయి దరఖాస్తు ఫారం నింపాలని సూచించారు. రిజిస్ట్రేషన్ ఫీజు, కోర్సు ఫీజు, పరీక్ష ఫీజులను ఆన్‌లైన్ విధానంలోనే చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 88861 11690, 040-27097177, 040-27098350 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఈ నెల 17 నుంచి సెల్ట్ తరగతులు

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 11: ఉస్మానియా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలోని సెంటర్ ఫర్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ ట్రైనింగ్ (సెల్ట్)లో ఈ నెల 17వ తేదీ నుంచి తరగతులను నిర్వహించనున్నట్లు సెల్ట్ డైరెక్టర్ ప్రొఫెసర్ సవీన్ సౌడ ఒక ప్రకటనలో తెలిపారు. 'ఎ సర్టిఫికెట్ కోర్స్ ఇన్ ఇంగ్లిష్ కమ్యూనికేషన్ స్కిల్స్ అండ్ పర్సనాలిటీ డెవలప్ మెంట్' పేరుతో నిర్వహించే రెండు నెలల కోర్సుకు ప్రతిరోజూ ఉదయం ఆరున్నర నుంచి ఎనిమిది గంటల వరకు ప్రత్యేక బ్యాచ్ ను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు ఈ నెల 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ఇతర వివరాలకు 79899 03001, 98497 52655 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఫిర్యాదులు సత్వరం పరిష్కరించాలి

- ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్
- పలు కాలనీల్లో స్థానికులతో కలిసి పర్యటన

ముషీరాబాద్, ఫిబ్రవరి10: ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అధికారులను ఆదేశించారు. రంజాన్ మాసం ప్రారంభమవుతుండటంతో మసీదుల వద్ద రోడ్డు, డ్రైనేజీ, వీధి దీపాలు, పారిశుధ్యం వంటి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. మంగళవారం ఆయన ముషీరాబాద్ డివిజన్ ప్రెండ్స్‌కాలనీ, అడిక్‌మెట్ డివిజన్ పాతీమా మసీదు ప్రాంతాల్లో పర్యటించి స్థానిక సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ బస్తీలలో పర్యటించడం ద్వారా ప్రజా సమస్యలు తెలుసుకొని అప్పటికప్పుడు పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంతోటు భస్తీల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. దశలవారిగా పెండిగ్ సమస్యలు పరిష్కరించనున్నట్లు పెర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు సయ్యద్ అస్లాం, సురెందర్, వెంకటరామ్‌రెడ్డి, గురుదీప్ సింగ్, శ్రీధర్‌రెడ్డి, ఆకుల అరుణ్‌కుమార్, ఎయిర్‌టెల్ రాజు, టెంట్ హౌస్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పాతిమా మసీదు ప్రాంతంలో పర్యటిస్తున్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్

సెంట్రల్ బట్రీలో ఘనంగా ఫీస్ట్ వేడుకలు



ప్రార్థనల అనంతరం బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గజ్జల నాగేశ్

బొల్లారం, ఫిబ్రవరి 11: కంటోన్మెంట్ ఏడో వార్డు లాల్ బజార్ పరిధిలోని సెంట్రల్ బట్రీ బస్తీలో 125వ ఫీస్ట్ వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సందర్భంగా రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గజ్జల నాగేశ్, కంటోన్మెంట్ బోర్డు మాజీ సభ్యుడు శ్యాంకుమార్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఫాదర్ మారెడ్డి, సీనియర్ నాయకులు సత్యనారాయణగౌడ్, యశ్వంత్ కుమార్ ఉమేశ్ తదితరులు పాల్గొన్నారు.

సెట్ పరీక్షను తిరిగి నిర్వహించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: టీఎస్ సెట్ హిస్టరీ పరీక్షను రద్దుచేసి తిరిగి నిర్వహించాలని డిమాండ్ చేస్తూ అభ్యర్థులు ఆందోళనకు దిగారు. ఉస్మానియా యూనివర్సిటీ పరిపాలన భవనంలో అధికారులతో వాగ్వాదానికి దిగిన అభ్యర్థులు అనంతరం అక్కడే ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ అధికారులు కనీస అర్హతలు లేని వారితో ప్రశ్నాపత్రాలు రూపొందించారేమో అని అనుమానాలు కలుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్యం వైఖరితో అభ్యర్థుల విలువైన జీవితాలతో ఆటలాడుకుంటున్నారని మండిపడ్డారు. పరీక్షలో 39 ప్రశ్నలు తప్పుగా రాగా, కేవలం 25 ప్రశ్నలకి మార్కులు కలపడాన్ని తప్పుపడ్డారు. ఇది పూర్తిగా యుజిసి నిబంధనలకు వ్యతిరేకమని స్పష్టం చేశారు. ఈ తప్పిదాలకు వర్సిటీ అధికారులే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. పరీక్షను రద్దు చేసి, తిరిగి నిర్వహించే వరకు తమ పోరాటాన్ని ఆపేది లేదని స్పష్టం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై మీడియా ప్రతినిధులు అధికారులతో మాట్లాడగా పొంతనలేని సమాధానాలు ఇచ్చారు.

నేడు కరెంట్ ఉండని ప్రాంతాలు

ముషీరాబాద్, ఫిబ్రవరి 11: టీఎస్ఎస్ పీడీసీఎల్ అజామాబాద్ డివిజన్ పరిధిలోని గోల్కొండ ఎక్స్ రోడ్డు, మదర్ డైరీ, పార్శిగుట్ట పీడర్ల పరిధిలో నేడు బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏడీఈ నాగేశ్వరరావు తెలిపారు. ఉదయం 10 నుంచి 11 గంటల వరకు గోల్కొండ ఎక్స్ రోడ్ పీటర్ పరిధిలోని శివాలయం టెంపుల్ ముషీరాబాద్ పోలీస్ స్టేషన్ కృష్ణకాలనీ, ఏక్ మినార్ పరిసరాల్లో విద్యుత్ సరఫరా ఉండదు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం12 గంటల వరకు ఫీడ పరిధిలోని ప్రైయర్ పవర్ చర్చి, బాప్టిస్ట్ చర్చి బ్రహ్మంగారి టెంపుల్, ఈడబ్ల్యూఎస్ క్వార్టర్స్ పరిసరాల్లో విద్యుత్ సరఫరా ఉండదు. మధ్యాహ్నం 12 నుంచి ఒంటి గంట వరకు మదర్ డైరీ ఫీడర్ పరిధిలోని రాంనగర్ ఎక్స్ రోడ్, మదర్ హైస్కూల్, లక్ష్మమ్మ పార్క్ పరిసరాల్లో విద్యుత్ సరఫరా ఉండదు.

నాలా పూడికతీత పనుల పరిశీలన

ఉస్మానియా యూనివర్సిటీ: బౌద్ధ నగర్ డివిజన్ ఏఆర్కే నగర్‌లోని నాలాలో నిర్వహిస్తున్న పూడికతీత పనులను స్థానిక కార్పొరేటర్ కంది శైలజ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాలల్లో పూడికతీత పనులను ఎప్పటికప్పుడు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో డీఈఈ తిరుపతి, ఏఈ లావణ్య, బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఫుట్ పాత్ ఆక్రమణల తొలగింపు

కూల్చివేతలు చేపడుతున్న సిబ్బంది

అడ్డగుట్ట, ఫిబ్రవరి 11: అడ్డగుట్ట శాస్త్రి నగర్ నుంచి మారేడుపల్లి తహసీల్దార్ కార్యాలయం వరకు ఫుట్‌పాత్‌లను ఆక్రమించి ఏర్పాటు చేసిన షెడ్లను మంగళవారం జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు తొలగించారు. ఫుట్‌పాత్ పై ఏర్పాటు చేసిన ఆక్రమలను తీసివేయాలని గత పది రోజులుగా జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు స్థానికులకు పలుమార్లు హెచ్చరికలు జారీ చేశారు. అయినా కూడా వారి నుండి ఎలాంటి స్పందన లేకపోవడంతో అధికారులు తుకారాం గేట్ పోలీసుల సహకారంతో ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించారు. ఇదే దారిలో తుకారంగేట్ పోలీస్ స్టేషన్, అడ్డగుట్ట ఆరోగ్య కేంద్రం, మారేడ్‌పల్లి తహసీల్దార్ కార్యాలయం ఉండడంతో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలను సాగించడం జరుగుతుందని, ప్రధాన రహదారిని ఆక్రమించి షెడ్లను ఏర్పాటు చేయడం ద్వారా తీవ్రమైన ట్రాఫిక్ సమస్య తలెత్తుతుందని పలువురు చెప్పుకొస్తున్నారు. ఫుట్ పాత్ లను ఆక్రమించి వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగించరాదని, ప్రధాన, అంతర్గత రోడ్డులను ఆక్రమిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని టౌన్ ప్లానింగ్ అధికారులు ఈ సందర్భంగా హెచ్చరించారు.

మహదేవ మణి కవిత్వం దివ్యమైనది

ముషీరాబాద్, ఫిబ్రవరి 11: మహదేవ మణి కవిత్వం దివ్యమైనదని, శాస్త్రీయమైనదని ప్రఖ్యాత కవి జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు అన్నారు. మంగళవారం త్యాగరాయ గానసభలో ఉపాసన సంస్థ ఆధ్వర్యంలో బృహత్ శ్రీధరీయం కావ్య ఆవిష్కరణ జరిగింది. కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని బృహత్ శ్రీధరయం కావ్యాన్ని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ఎన్నో యాగాలు, ఎందరో స్వామీజీలు, గుడులు వెలుస్తున్న సందర్భాన్ని మహదేవమణి వ్యంగ్యంగా పద్య రూపంలో చెప్పారని వివరించారు. ఈ కార్యక్రమంలో సూర్యనారాయణమూర్తి, శ్రీరామ్ నాథ్, ఎం.దత్తాత్రేయశర్మ, వెంకటేశ్వరశర్మ, అపర్ణ, సంస్థ నిర్వాహకులు డాక్టర్ మహేశ్వరి, డాక్టర్ సీతాపతి, కళ్యాణి, దివాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

కావ్యాన్ని ఆవిష్కరించిన జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు

ఆకట్టుకున్న గాంధీజీ బుర్రకథ గానం

కళాకారులను సత్కరించిన కళా జనార్దనమూర్తి

ముషీరాబాద్ ఫిబ్రవరి 11: చిక్కడపల్లి త్యాగరాయ గానసభ ఆధ్వర్యంలో మాజీ ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కె.వి.రమణాచారి జన్మదిన సందర్భంగా సోమవారం గాంధీజీ జీవిత చరిత్రపై నిర్వహించిన బుర్రకథ ఆకట్టుకుంది. ఎడ్ల ప్రేమేందర్ బృందం గాంధీజీ జీవిత చరిత్రను ఆధునిక కాలానికి అనుగుణంగా వివరించారు. ఈ కార్యక్రమంలో గానసభ అధ్యక్షుడు కళా జనార్దన మూర్తి పాల్గొని కళాకారులను సత్కరించారు. గానసభ పాలకమండలి సభ్యుడు బండి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

ఉచిత వైద్యశిబిరానికి స్పందన

బన్సీలాల్ పేట్, ఫిబ్రవరి 11: చాచా నెహ్రూ నగర్ కమ్యునిటీ హాలులో మంగళవారం జరిగిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. రెయిన్ బో ఫౌండేషన్ ఇండియా, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రైయిన్ బో కమ్యూనిటీ కేర్ అండ్ లెర్నింగ్ సెంటర్, జనహిత సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో హబ్సీగూడలోని ఆనంద్ ఐ ఇనిస్టిట్యూట్ సహకారంతో జరిగిన శిబిరాన్ని కార్పొరేటర్ కె.హేమలత ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కంటి చూపు ఎంతో ముఖ్యమైనదని ప్రతి ఒక్కరూ కళ్లను జాగ్రత్తగా కాపాడుకోవాలని అన్నారు. ఎక్కువసేపు సెల్ ఫోన్, టీవీ చూడడం వల్ల చాలామందికి కంటి చూపు దెబ్బ తింటున్నదని అన్నారు. ఈ శిబిరంలో నేత్ర వైద్యులు 200 మందికి కంటి చూపును పరీక్షించారు. అందులో 30 మందికి కేటరాక్ట్ ఆపరేషన్ కోసం సిఫారసు చేశారు. ఆనంద్ ఐ ఇనిస్టిట్యూట్ కోఆర్డినేటర్ పూర్ణచందర్, జనహిత సేవా ట్రస్ట్ ప్రతినిధి నర్సింహమూర్తి, నర్సింగ రావు, రెయిన్ బో హోమ్స్ ప్రోగ్రాం నగర కోఆర్డినేటర్ క్రాంతికిరణ్, పీపుల్స్ కలెక్టివ్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్ ప్రతినిధి అంబిక, ప్రాజెక్ట్ ఇన్‌చార్జి సుజాత, సీబీసీ కోఆర్డినేటర్లు సంధ్యారాణి, నాగభూషణం, రామస్వామి, రాజు, టీచర్ వెంకటలక్ష్మి కళావతి పాల్గొన్నారు.

కూరగాయల వ్యాపారులను ఆదుకోవాలి

బొల్లారం, ఫిబ్రవరి 11: ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంలో భాగంగా జేబీఎస్ నుంచి శామీర్ పేట వరకు రోడ్డు విస్తరణ భూసేకరణలో అల్వాల్ రైతు బజార్ భూములు కూడా ఉండడంతో, దాని ద్వారా జీవనం సాగిస్తున్న రైతులు, వ్యాపారులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. మేరకు మంగళవారం అల్వాల్ డిప్యూటీ తహసీల్దార్ సుధాకర్, కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ తో కలిసి రైతుబజార్ ను సందర్శించారు . ఈ సందర్భంగా కూరగాయల వ్యాపారులు కొన్నేండ్లుగా ఇక్కడే వ్యాపారం చేస్తున్నామని, ఇప్పుడు కారిడార్ నిర్మాణం చేపడితే తమకు ప్రత్యామ్యాయ భవనం నిర్మించాలని కోరారు. ప్రభుత్వం తమకు అనువైన చోట స్థలాన్ని కేటాయించి మోడల్ రైతుబజార్ ను నిర్మించి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం రైతు బజార్లో మరుగుదొడ్లు, నీటి వసతులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వేణుగోపాల్ రెడ్డి , నరసింహన్, అరవింద్, శ్రీనివాస్, వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.

14న బేగంపేటలో మెగా జాబ్ మేళా

బేగంపేట్, ఫిబ్రవరి 11: ఈనెల 14న నగరంలోని ప్రముఖ హోటల్ మేనేజ్మెంట్ సంస్థ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్మెంట్- శ్రీ శక్తి, బేగంపేట ఆధ్వర్యంలో జోబోధాన్-2025ను తమ కళాశాల ప్రాంగణంలో నిర్వహించనున్నారు. సంబంధిత పోస్టర్ ను మంగళవారం జాబోతాన్ నిర్వాహకులు ప్రత్యేక కార్యదర్శి జయష్ రంజన్ ఆవిష్కరించారు. ఈ మేళాలో సుమారుగా 25 ప్రముఖ జాతీయ అంతర్జాతీయ సంస్థలు పాల్గొననున్నాయని నిర్వాహకులు తెలిపారు. ఆసక్తిగల నిరుద్యోగ యువత, ఆతిధ్యరంగ విద్యార్థులు, నిపుణులు ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చునని చెప్పారు. మరిన్ని వివరాలకు 944 04 0 99 88 ఫోన్ నబర్ లో సంప్రదించగలరు లేదా www. ihmshrishakti. com వెబ్ సైట్ లో రిజిస్ట్రేషన్ చేసుకోగలరు. ఈ జాబ్ ఫెయిర్ లో ప్రముఖ ఆతిథ్యరంగ సంస్థలైన తాజ్ గ్రూప్, ఐటిసి వెల్కమ్, హయత్, మారియట్, రాడిసన్ వంటి సంస్థలు పాల్గొనున్నాయి. పురోగమిస్తున్న ఆతిథ్యరంగంలో ప్రపంచవ్యాప్తంగా మరిన్ని అవకాశాలు ఉన్నాయి. ప్రముఖ విదేశీ కన్సల్టెన్సీ సంస్థలైన కెరీర్ క్రాఫ్టర్, ఏఎస్పిడి, ట్రివల్ చాప్టర్ వంటి సంస్థలు స్కిల్ ఇమిగ్రేషన్, J1 వీసా మరియు ఇంటర్నేషనల్ ట్రైనింగ్ పట్ల ఆసక్తి గల విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నాయి.

16న స్కాలర్‌షిప్ టెస్ట్

చిక్కడపల్లి, ఫిబ్రవరి 11: శ్రీరామ్స్ ఐఏఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 16న ఉదయం 10:30 గంటలకు యూపీఎస్సీ 2026 ప్రిలిమ్స్, మెయిన్స్ ఫౌండేషన్ ప్రోగ్రామ్ కోసం ఐఏఎస్ స్కాలర్‌షిప్ పరీక్షను నిర్వహిస్తున్నట్లు సంస్థ మార్కెటింగ్ హెడ్ రాఘవ తెలిపారు. పరీక్ష ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో హైదరాబాద్ కేంద్రంలో జరుగుతుంది. సివిల్స్‌కు సిద్ధమవుతున్న అభ్యర్థులకు స్కాలర్‌షిప్ సాదించడానికి గొప్ప అవకాశమని పేర్కొన్నారు. టాప్ 20 ప్రతిభను కనబరిచిన వారికి కోర్సు ఫీజులపై 50శాతం తగ్గింపు లభిస్తుంది, టాప్ 50 మందికి 30శాతం తగ్గింపు లభిస్తుంది. ఆసక్తిగల అభ్యర్థులు ముందుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం, 81211 91985, సుదర్శన్ థియేటర్ ఎదురుగా, పిల్లర్ నంబర్-40 వద్ద ఉన్న తమ కార్యాలయాన్ని సంప్రదించాలని వారు కోరారు.

విమాన యానంలో ఉపాధి అవకాశాల పై సదస్సు

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన సదస్సులో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ప్రభు

ముషీరాబాద్, ఫిబ్రవరి 11: విద్యానగర్ లోని వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కెరియర్ గైడెన్స్ సెల్ ఆధ్వర్యంలో విమాన యానంలో ఉపాధి అవకాశాలపై సదస్సు జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. ప్రభు మాట్లాడుతూ యువత ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవడానికి ఇటువంటి కార్యక్రమం దోహదపడుతుందని అన్నారు. విద్యార్థులు ఇటువంటి అవకాశాన్ని సద్వినియోగం పరుచుకోవాలని సూచించారు. సదరన్ సివిల్ ఏవియేషన్ చెన్నై బ్రాంచ్ రిటైర్డ్ మేనేజర్ ఎ.రాంబాబు పాల్గొని విమానయాన షెడ్యూలింగ్, కార్యకలాపాలు, లాజిస్టిక్ విమానాశ్రయంలో వివిధ విభాగాల్లో ఉండే ఉద్యోగ అవకాశాల గురించి వివరించారు. ప్రభుత్వ కళాశాలలో చదివే విద్యార్థులకు అతి తక్కువ ఫీజుతో కోచింగ్ అవకాశాలు ఉన్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ లావణ్య, రమాదేవి, నీరజ, సంతోషి తదితరులు పాల్గొన్నారు.

కలుషిత నీటి సమస్య పరిష్కారానికి కృషి

పనులను పరిశీలిస్తున్న రాసూరి కార్పొరేటర్ సునీత

అడ్డగుట్ట, ఫిబ్రవరి 11: డివిజన్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు మెట్టుగూడ కార్పొరేటర్ రాసూరి సునీత తెలిపారు. డీబీఆర్ సమీపంలోని ప్రగతి స్కూల్ నుంచి కలుషిత నీరు సరఫరా అవుతుందని ఫిర్యాదు అందుకున్న కార్పొరేటర్ మంగళవారం ఆ ప్రాంతాల్లో పర్యటించారు. ఆమె మాట్లాడుతూ జలమండలి అధికారులతో కలిసి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఆమె తెలిపారు.

కోర్టు ఉత్తర్వుల మేరకు కూల్చివేతలు

అమీర్‌పేట్, ఫిబ్రవరి 11: కోర్టు ఉత్తర్వుల మేరకు ఎస్సార్‌నగర్ ఈడబ్ల్యూఎస్ క్వార్టర్లలో జీహెచ్ఎంసీ అధికారులు ఉద్రిక్తతల నడుమ అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. క్వార్టర్ నంబర్ 41లో యజమాని రామకృష్ణ జీహెచ్ఎంసీ ద్వారా గ్రౌండ్ ప్లస్ టూ ఫ్లోర్లకు అనుమతులు పొంది, అదనంగా మూడో అంతస్తుతోపాటు పెంట్‌హౌస్ నిర్మాణాలను కూడా చేపడుతుండడంతో కాలనీ అసోసియేషన్ ప్రతినిధులుగా చెబుతున్న కొందరు కోర్టులో సవాల్ చేశారు. అక్రమంగా జరుగుతున్న నిర్మాణాలను కూల్చివేయాలని కోర్టు ఉత్తర్వులిచ్చింది. మంగళవారం తమకు అందిన ఉత్తర్వుల మేరకు జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ సెక్షన్ అధికారి మన్సూర్ తారిక్ సిబ్బందితో కలిసి కూల్చివేతలు చేపట్టారు. ఇదిలా ఉంటే కూల్చివేతలకు వచ్చిన టౌన్‌ప్లానింగ్ సిబ్బందిని నిర్మాణదారు రామకృష్ణ, కుటుంబ సభ్యులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. తమపై ఫిర్యాదులు చేశారని చెబుతున్న వారి నిర్మాణాలు కూడా తాను చేపడుతున్న నిర్మాణాలకు సమాంతరంగానే ఉన్నాయని, అధికారులు వాటిని వదిలేసి తన నిర్మాణాలను కూల్చివేయడం అన్యాయమంటూ నిరసనకు దిగారు. దీంతో పోలీసుల సహకారం తీసుకొని కూల్చివేతలు చేపడుతున్నామని టౌన్ ప్లానింగ్ అధికారులు తెలిపారు.

వర్గీకరణలో స్వల్ప తేడాలను సరిచేయాలి

చిక్కడపల్లి, ఫిబ్రవరి 11: వర్గీకరణ గ్రూపుల్లో జరిగిన స్వల్ప తేడాలను సరిచేయాలని, ప్రకటించిన గ్రూపు 1, 2, 4 ఉద్యోగాలను ప్రకటించిన వర్గీకరణ పద్ధతిలో ఖాళీలను భర్తీ చేయాలని బంధు సొసైటీ అధ్యక్షుడు పల్లెల వీరస్వామి, గౌరవ అధ్యక్షుడు అప్పికట్ల భరత్ భూషణ్ డిమాండ్ చేశారు. బంధు సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 30 ఏండ్లుగా అన్నదమ్ముల మధ్య ఉన్న సమస్య ముగిసిందన్నారు. రాష్ట్ర బడ్జెట్లో విద్యా వైద్య రంగానికి కనీసం 20శాతానికి తగ్గకుండా నిధులు కేటాయించాలని కోరారు. సమావేశంలో వివిధ సంఘాల నాయకులు వశపాక నరసింహ, ఆంజనేయులు, రాజగోపాల్, బాకారం లావణ్య, గండి కృష్ణ, ఎండీ అశోక్, జనార్దన్ గౌడ్, ఆశయ్య పాల్గొన్నారు.

భార్యతో గొడవపడి నిప్పంటించుకున్న భర్త మృతి

బేగంపేట్, ఫిబ్రవరి 11: భార్యతో ఘర్షణ పడిన భర్త ఆమె పని చేసే షాపులోకి వెళ్లి పెట్రోల్ పోసుకుని నిప్పు అంటించుకున్నాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన శ్రవణ్ ను మార్కెట్ పోలీసులు చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించిన విషయం తెలిసిందే. మూడు రోజులుగా చికిత్స పొందుతున్న శ్రవణ్ మంగళవారం సాయంత్రం మృతి చెందినట్లు మార్కెట్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర వెల్లడించారు.

స్కందగిరి ఆలయంలో కావడి పూజ

బన్సీలాల్ పేట్, ఫిబ్రవరి 11: పద్మారావునగర్ లోని స్కందగిరి సుబ్రమణ్య స్వామి ఆలయంలో తైపూసం లక్షార్చన మహోత్సవం, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం భక్తులు మంగళవాయిద్యాల నడుమ కావడిలను భుజాన ఎత్తుకుని, పాలకుండలతో గిరి ప్రదక్షణ నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ ఎల్వీ సుబ్రహ్మణ్యం, ట్రస్టీ కృష్ణన్ రాజమణి పర్యవేక్షణలో ఉత్సవాలు ఘనంగా జరిగాయి.

నాగార్జుననగర్ కాలనీ పార్క్ అభివృద్ధికి చర్యలు

ఉస్మానియా యూనివర్సిటీ: తార్నాక డివిజన్లోని నాగార్జుననగర్ కాలనీ పార్క్ అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని గ్రేటర్ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత హామీ ఇచ్చారు. ఎమ్మెల్సీ కోదండరాం, టీటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు శోభన్‌రెడ్డి లతో కలిసి పార్కును సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ పార్కులు ప్రజల శారీరక, మానసిక ఆరోగ్యం కోసం ఎంతో ముఖ్యమైనవని అన్నారు. సీనియర్ సిటిజెన్ల కోసం టాయిలెట్లు, వాకర్స్ కోసం సరైన సదుపాయాలు, పర్యావరణ హితంగా ఉండే వసతులు పార్కులో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవికిరణ్‌తో మాట్లాడి అవసరమైన చర్యలు చేపట్టాల్సిందిగా ఆమె సూచించారు.

నేషనల్ మాస్టర్ ప్లేయర్స్ టీటీ విజేతలకు సన్మానం

ఉస్మానియా యూనివర్సిటీ: ఇటీవల నిర్వహించిన ఫస్ట్ నేషనల్ మాస్టర్ ప్లేయర్స్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్‌లో విజేతలను నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత మంగళవారం సన్మానించారు. లాలాపేటలోని ప్రొఫెసర్ జయశంకర్ స్టేడియంలో వెటరన్స్ టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముంబైలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఫస్ట్ నేషనల్ మాస్టర్ ప్లేయర్స్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్‌లో విజయం సాధించి పతకాలు గెలుచుకున్న క్రీడాకారులను అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, టేబుల్ టెన్నిస్ క్రీడలో దేశానికి పేరు తెచ్చిన ఈ విజేతలు భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలు సాధించాలని ఆకాంక్షించారు. ప్లేయర్ల కృషి, పట్టుదల యువతకు స్ఫూర్తిదాయకమని అన్నారు. ఈ కార్యక్రమంలో టీటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు మోతె శోభన్‌రెడ్డి, పలువురు క్రీడాభిమానులు హాజరయ్యారు.